# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 30 8-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06







## ఏనాటికైనా కాంగ్రెస్ పుట్టి ముంచేటోడే...

- సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- బీజేపీతో కలిసి బీఆర్ఎస్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తుండు
- ఇచ్చిన హామీల సంగతి పక్కన పెట్టి తిట్లదండకం అందుకుండు
- కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల్లో ప్రచారం



2లో



# ఎఫ్ఎస్ఎల్‌లో భారీ అగ్ని ప్రమాదం
# 'కీలక ఆధారాలు ఆహుతి'?

- పూర్తిగా కాలిపోయిన పలు కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు
- ఓటుకు నోటు, ఎమ్మెల్యేల కొనుగోలు, ఫోన్ ట్యాపింగ్ సహా పలు కేసుల్లో కీలక ఆధారాలు బూడిద!
- ఐదు ఫైరింజన్లు, ఒక రోబోతో మంటలు అదుపులోకి..
- ప్రమాదంలో ఆఫీస్ బాయ్‌కి అస్వస్థత.. ప్రభుత్వాస్పత్రికి తరలింపు
- సురక్షితంగా బయటపడ్డ మరో ముగ్గురు ఉద్యోగులు
- షార్ట్‌సర్క్యూట్‌తోనే మంటలు: డీసీపీ శిల్పవల్లి
- భవనంలో అత్యంత కీలకమైన మొదటి అంతస్తులో ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు
- ఓటుకు నోటు కేసులో ఆధారాలు మాయం చేసేందుకే..: కేటీఆర్
- ప్రమాదంపై అనుమానాలు వ్యక్తంచేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ కార్యాలయంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం భారీ నష్టాన్ని మిగిల్చింది. నేర పరిశోధనలో అత్యంత కీలకమైన సాక్ష్యాధారాలను భద్రపరిచే చోట మంటలు చెలరేగడంతో, పలు కేసుల్లో సేకరించిన భౌతిక ఆధారాలు (గ్రాష్ట్రఎంఱఘ్రీ జుజఱనవఅఎవ) పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంపై డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీదాస్ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూ విస్తుపోయే వివరాలను వెల్లడించారు. మంటలు వ్యాపించిన తీరు, జరిగిన ఆస్తి నష్టం, కేసులపై పడే ప్రభావం గురించి ఆయన వివరించారు.

- మిగతా 2వ పేజీలో

## భారత క్వాంటం విప్లవానికి అమరావతి నాయకత్వం వహిస్తుందన్న లోకేశ్

- అమరావతిలో క్వాంటం వ్యాలీకి సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ భూమిపూజ
- క్వాంటం వ్యాలీతో రానున్న హై క్వాలిటీ ఉద్యోగాలను వివరించిన లోకేశ్
- ఐబీఎం, టీసీఎస్ సహా 14 దిగ్గజ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలు

2లో



## సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు...

- బురద రోడ్డుపై విద్యార్థుల ఆవేదన.. సోషల్ మీడియాలో వీడియో
- వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- గజ్జలవారిపల్లికి రూ.86 లక్షలతో తక్షణమే రోడ్డు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో ఉదయగిరిలో రూ.55 కోట్ల రోడ్ల పనులు
- ఈ రోడ్డు మంజూరుతో విద్యార్థులు, రైతుల కష్టాలకు తెర

## ఎప్‌స్టీన్ ఫైళ్లలో అనిల్ అంబానీ పేరు...

- మహిళను ఏర్పాటు చేయాలని కోరినట్లు వెల్లడైన చాటింగ్ వివరాలు
- అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన డాక్యుమెంట్లలో సంచలన విషయాలు
- వ్యాపారం, ఇతర అంశాలపై ఇద్దరి మధ్య నిరంతర సంప్రదింపులు
- ఈ ఆరోపణలపై స్పందించేందుకు నిరాకరించిన అనిల్ అంబానీ ప్రతినిధి



2లో

# ఎనిమిదేళ్లు ఇందిరమ్మ రాజ్యమే..

## వికారాబాద్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారుస్తాం

- వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- నారాయణపూర్‌లో ప్రజాపాలన -ప్రగతిబాట బహిరంగ సభ
- స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ
- రెండేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చాం
- గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం -సీఎం

వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతిబాట బహిరంగ సభ పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ముందుకు వెళుతోందని ఆయన స్పష్టం

## మధ్యంతర ఒప్పందానికి సై

- భారత ఉత్పత్తులపై టారిఫ్‌లు 18 శాతానికి తగ్గిస్తామన్న అమెరికా
- 25 శాతం ప్రతీకార సుంకాలు రద్దు.. వెంటనే అమల్లోకి
- కార్యనిర్వాహక ఉత్తర్వులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం
- రష్యా నుంచి మళ్లీ చమురు కొంటే సుంకాల మోత తప్పదని స్పష్టీకరణ
- మధ్యంతర ఒప్పందంలో భాగంగా పలు ఉత్పత్తులపై టారిఫ్‌లు రద్దు లేదా తగ్గింపు
- 30 ట్రిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్‌లో భారత ఎగుమతిదారులకు ప్రవేశం



2లో



## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..
# ఇది చారిత్రక ఘట్టం

- తొలి కంప్యూటింగ్ వ్యవస్థ అమరావతిలో
- డిసెంబరు నాటికి తొలి 'కంప్యూటర్' చేతికి
- దీంతో 35-40 ఏళ్లపాటు యువత భవిత బంగారమే
- క్వాంటమ్‌లో నోబెల్ తెస్తే 100 కోట్ల నజరానా: సీఎం
- 15 ప్రముఖ సంస్థలతో ఎంవోయూలు
- త్వరలోనే క్వాంటమ్‌లో ఎంటెక్ కోర్సులు
- రూ.6వేల కోట్లతో నేషనల్ క్వాంటమ్ మిషన్: జితేంద్ర సింగ్

ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి "ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి

2లో

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..


# ఏనాటికైనా కాంగ్రెస్ పుట్టి ముంచెటోడే...

కామారెడ్డి/సిరిసిల్ల: 'రేవంత్ బీజేపీ మనిషే.. బడేభాయ్ తమ్ముడే.. ఏనాడూ కాంగ్రెస్ మనిషి కాలేడు.. ఏనాటికైనా కాంగ్రెస్ పుట్టి ముంచెటోడే.. బీజేపీతో కలిసి బీఆర్ఎస్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తుండు. ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కేసీఆర్‌ను తిట్టుడే పనిగా పెట్టుకుండు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డితోపాటు, సిరిసిల్లలో శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రోడ్‌షోలు, ర్యాలీలు నిర్వహించిన అనంతరం కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను తిట్టడానికే సమయం వెచ్చిస్తున్నాడని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఫ్రీ బస్సు ఒక్కటి ఇచ్చి సీటు, గౌరవం లేకుండా చేసి మగవాళ్ల నుంచి డబుల్ చార్జీలు వసూలు చేస్తుండని విమర్శించారు. కాంగ్రెసోళ్లు ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం ఇస్తామని ఓట్లేయించుకున్నారని, ఎక్కువ అడిగితే మెడలో ఉన్న పుస్తెలు లాక్కెళ్లే దండుపాళ్యం, స్టూవర్టుపురం దొంగల ముఠాలుగా తయారయ్యారని కేటీఆర్ విమర్శించారు. ఐదేళ్లు మంత్రిగా, ఐదేళ్లు స్పీకర్‌గా అవకాశమిచ్చి బాన్సువాడ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఇచ్చిన కేసీఆర్‌ను, కారు గుర్తుపై ఓటేసి గెలిపించిన ప్రజలను దగా చేసి రేవంత్‌రెడ్డి కింద చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రోషముంటే రాజీనామా చేయాలని కేటీఆర్ సవాల్ చేశారు. పార్టీ మారిన పోచారంపై చర్యలు తీసుకోవాలని తాము స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తే, తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పాడని, మరి బీఆర్ఎస్‌లో ఉంటే ఈ వేదిక మీద తన పక్కన ఎందుకు లేడని ప్రశ్నించారు.

## ఎప్‌స్టీన్ ఫైళ్లలో అనిల్ అంబానీ పేరు...

ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి సంబంధించిన ఓ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. అమెరికాలో లైంగిక నేరాలకు పాల్పడి, జైలులో ఆత్మహత్య చేసుకున్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తేలింది. వీరిద్దరి మధ్య జరిగిన వాట్సాప్ సందేశాలు, సంభాషణల వివరాలను అమెరికా న్యాయ శాఖ తాజాగా విడుదల చేసిన పత్రాల్లో బయటపెట్టింది. ఈ డాక్యుమెంట్ల ప్రకారం, 2017 నుంచి 2019 మధ్యకాలంలో వీరి మధ్య పలుమార్లు సంభాషణలు జరిగాయి. అంతేకాకుండా, అనిల్ అంబానీ హాలీవుడ్ కనెక్షన్ల గురించి చెబుతూ, నటి స్కార్లెట్ జోహాన్సన్‌తో తదుపరి సినిమా ఉందని పేర్కొనగా, తనకు "యంగ్ బ్లాండ్స్" (యువరాశులైన అందమైన అమ్మాయిలు) ఇష్టమని ఎప్‌స్టీన్ హాస్యంగా స్పందించాడు. ఈ ఆరోపణలపై స్పందించేందుకు అనిల్ అంబానీ ప్రతినిధి నిరాకరించారు. ఒకప్పుడు బిలియనీర్‌గా వెలుగొందిన అనిల్ అంబానీ ఆస్తులు ఇటీవలి కాలంలో గణనీయంగా తగ్గాయి. భారత్‌లో బ్యాంకు రుణాల ఎగవేత కేసులోనూ ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో లైంగిక నేరస్థుడిగా ముద్రపడిన ఎప్‌స్టీన్‌తో ఆయనకు సంబంధాలు ఉన్నట్లు బయటపడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2019లో సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలపై అరెస్ట్ అయిన ఎప్‌స్టీన్, విచారణ కొనసాగుతుండగానే జైలులో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

## సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు...

"పవన్ సర్.. రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేకపోతున్నాం. దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి" అంటూ విద్యార్థులు చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, కొండాపురం మండల పరిధిలోని గజ్జులవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

### క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

## ఇది చారిత్రక ఘట్టం

భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు.

# ఎనిమిదేళ్లు ఇందిరమ్మ రాజ్యమే..

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, బీజేపీ , బీఆర్ఎస్ పార్టీల మధ్య 'చీకటి ఒప్పందాలు' ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ-ఫామ్‌లను బీఆర్ఎస్ ఆఫీసుల నుండి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ, గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా ఢిల్లీలో ఉండే పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఏమిటని ప్రజలను ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలను అందిస్తే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవేనని, కానీ కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల జిల్లా రైతాంగం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని, ఆ ప్రాజెక్టు నిధులతో ఆయన కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకుని వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. తాండూరు, పరిగి , వికారాబాద్ ప్రాంతాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మక్తల్, నారాయణపేట , కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ రోడ్డు పూర్తి కాకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టానికి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిలే బాధ్యులని విమర్శించిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం కోర్టు కేసులను పరిష్కరించి ఆ రోడ్డు పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో రీజనల్ రింగ్ రోడ్డు , రేడియల్ రోడ్లు రాబోతున్నాయని, వికారాబాద్ త్వరలోనే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ చరిత్రను తాను చెరిపేయాలని చూస్తున్నానని కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర, దొంగ నోట్ల వ్యవహారం , దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర తెలంగాణ ఉన్నంత కాలం చెరిగిపోదని, ఆ 'పాపాల భైరవుడి' చరిత్ర ప్రజలకు గుర్తుండేలా చేసే బాధ్యత తనదని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేశామని గుర్తు చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విషం చిమ్మే పాములకు మళ్ళీ పాలు పోయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.






## ఎఫ్‌ఎస్‌ఎల్‌లో భారీ అగ్ని ప్రమాదం
# 'కీలక ఆధారాలు ఆహుతి'?

(మొదటి పేజీ తరువాయి)

ఈ అగ్నిప్రమాద తీవ్రత ఎంతలా ఉందంటే, సాక్ష్యాధారాలను భద్రపరిచిన గది మొత్తం పూర్తిగా కాలిపోయిందని శ్రీదాస్ తెలిపారు. విచారణలో ఉన్న పలు కేసులకు సంబంధించి సీజ్ చేసిన ప్రాపర్టీ మొత్తం ఈ ప్రమాదంలో ధ్వంసమైందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా డిజిటల్ సాక్ష్యాల నిధిగా భావించే సుమారు 40 నుండి 50 కంప్యూటర్లు మంటల్లో కాలిబూడిదయ్యాయి. గదిలో అత్యంత భద్రంగా స్టోర్ చేసి ఉంచిన హార్డ్ డిస్కులు కూడా మంటల ధాటికి పూర్తిగా కాలిపోయాయని, దీనివల్ల కీలకమైన డిజిటల్ డేటా శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఎలక్ట్రానిక్ వస్తువులే కాకుండా, ఆ గదిలో ఉన్న వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులు కూడా మంటలకు తోడవడంతో నష్టం తీవ్రత ఊహించని స్థాయిలో జరిగింది.(ఈ దుర్ఘటనకు విద్యుత్ షార్ట్ సర్క్యూటే ప్రధాన కారణమని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ప్రాథమికంగా నిర్ధారించారు. తొలుత మంటలు వ్యాపించిన సమయంలో అక్కడే ఉన్న ఎఫ్‌ఎస్‌ఎల్ (ఖీూా) సిబ్బంది తమ వద్ద ఉన్న పరికరాలతో వాటిని ఆర్పేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అయితే, లోపల ఉన్న ఎలక్ట్రానిక్ విడిభాగాలు , ప్లాస్టిక్ సామగ్రి కారణంగా మంటలు ఒక్కసారిగా చెలరేగి, గది మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో మంటలను అదుపు చేయడం సిబ్బందికి సాధ్యం కాలేదని, చూస్తుండగానే సాక్ష్యాధారాలన్నీ అగ్నికి ఆహుతయ్యాయని ఆయన వివరించారు. దట్టమైన పొగ కారణంగా లోపలికి వెళ్లడం కూడా అగ్నిమాపక సిబ్బందికి సవాలుగా మారింది.

## భారత క్వాంటం విప్లవానికి అమరావతి నాయకత్వం వహిస్తుందన్న లోకేశ్

అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీ ఎలాంటి ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలను సృష్టించబోతోందో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టత ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా క్వాంటం ఇంజనీర్లు, అడ్వాన్స్‌డ్ ఏఐ నిపుణులు, కంప్యూటింగ్ స్పెషలిస్టులు, చిప్ డిజైనర్లు, క్రయోజెనిక్స్ ఎక్స్‌పర్టులు, ఆర్ఎఫ్ ఇంజనీర్లతో పాటు డీప్ టెక్ పరిశోధకులకు భారీ స్థాయిలో అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. శనివారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అమరావతిలో క్వాంటం వ్యాలీకి భూమిపూజ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ ఈ వివరాలు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా యువతకు కేవలం ఉద్యోగాలు ఇవ్వడమే కాదని, అవి 'ఫ్యూచర్ ప్రూఫ్' ఉద్యోగాలని ఆయన నొక్కి చెప్పారు. అమరావతి కేవలం పరిపాలనా రాజధానిగానే పరిమితం కాదని, ఇది సైన్స్, కంప్యూటేషన్, ఇన్నోవేషన్ రాజధానిగా రూపాంతరం చెందబోతోందని లోకేశ్ ప్రకటించారు. "మన యువత అత్యాధునిక సాంకేతికతను కేవలం ఉపయోగించే వారుగా కాకుండా, దానిని సృష్టించే నిర్మాతలుగా మారాలన్నదే మా లక్ష్యం. క్వాంటం, డీప్ టెక్, ఏఐ వంటివి అమరావతి కొత్త గుర్తింపును నిర్వచిస్తాయి. ఇది ప్రపంచ స్థాయి ప్రతిభను ఆకర్షించే నగరంగా, అత్యాధునిక టెక్నాలజీని ప్రపంచానికి ఎగుమతి చేసే కేంద్రంగా మారుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో హైదరాబాద్ ఐటీ విప్లవానికి ఎలా నాయకత్వం వహించిందో, ఇప్పుడు అదే స్ఫూర్తితో అమరావతి భారతదేశ క్వాంటం విప్లవానికి నేతృత్వం వహించబోతోందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.

# మధ్యంతర ఒప్పందానికి సై

వాషింగ్టన్/న్యూఢిల్లీ: భారత్, అమెరికా మధ్య పూర్తిస్థాయి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా మరో ముందడుగు పడింది. ఇరుదేశాల పారిశ్రామికవర్గాలు, ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులకు తీపి కబురు అందింది. భారత్, అమెరికాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేసుకున్నాయి. ఈ మేరకు ఇరుదేశాలు శనివారం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ప్రస్తుతం భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు వసూలు చేస్తుండగా.. మధ్యంతర ఒప్పందంలో భాగంగా వాటిని 18 శాతానికి తగ్గించినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు గత ఏడాది ఆగస్టులో విధించిన 25 శాతం అదనపు సుంకాలను రద్దు చేసినట్లు వెల్లడించింది. సంబంధిత కార్యనిర్వాహక ఉత్తర్వులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. 25 శాతం అదనపు సుంకాలను శనివారం నుంచే రద్దు చేస్తున్నట్లు అమెరికా తేల్చిచెప్పింది. రష్యా నుంచి చమురు కొనడం ఆపేసి, అమెరికా నుంచి ఇంధన ఉత్పత్తులను భారత్ కొంటుందని ఆశిస్తున్నట్లు ట్రంప్ తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో ప్రస్తావించారు. రాబోయే పదేళ్లలో అమెరికాతో రక్షణ సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఫ్రేమ్‌వర్క్‌కు కట్టుబడి ఉంటామని భారత్ అంగీకరించిందని పేర్కొన్నారు. ఒప్పందంలో భాగంగా పలు ఉత్పత్తులు, వస్తువులపై సుంకాలు రద్దు చేయడం లేదా తగ్గించడం జరిగినట్లు ఉమ్మడి ప్రకటనలో ఇరుదేశాలు పేర్కొన్నాయి. తద్వారా రెండు దేశాల నడుమ ద్వైపాక్షిక వాణిజ్యం మరింత వృద్ధి చెందుతుందని, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలియజేశాయి. ఇది పరస్పరం ఇచ్చిపుచ్చుకొనే, ఉమ్మడిగా ప్రయోజనం పొందే ఒప్పందమని అభివర్ణించాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఇది తొలిదశ అని ఉద్ఘాటించాయి. పూర్తిస్థాయి ఒప్పందంపై చర్చలను మరింత వేగవంతం చేస్తామని తెలిపాయి. మధ్యంతర ఒప్పందం వల్ల అమెరికాలో 30 ట్రిలియన్ డాలర్ల విలువైన మార్కెట్ భారత ఎగుమతిదారులకు అందుబాటులోకి వస్తుందని భారత ప్రభుత్వం ఆశాభావం వ్యక్తంచేసింది. మధ్యంతర ఒప్పందంపై వచ్చే నెల రెండో వారంలో సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. ఈ ఒప్పందాన్ని చాలా వేగంగా అమల్లోకి తీసుకొస్తామని భారత్, అమెరికా ప్రకటించాయి. అమెరికా ఆహార, వ్యవసాయ ఉత్పత్తులతోపాటు కొన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులు, వస్తువులపై సుంకాలను రద్దు చేశామని, మరికొన్నింటిపై తగ్గించామని భారత ప్రభుత్వం వెల్లడించింది. పశువుల దాణాగా ఉపయోగించే ఎర్రజొన్నలు, ట్రీ నట్స్, శుద్ధి చేసిన పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్, స్పిరిట్స్, మద్యం తయారీలో వాడే ధాన్యాల వంటివి ఇందులో ఉన్నట్లు పేర్కొంది. అమెరికా నుంచి వచ్చే ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధన ఉత్పత్తులు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విమాన విడిభాగాలు, అరుదైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోబోతున్నట్లు స్పష్టంచేసింది. రష్యా నుంచి ప్రత్యక్ష



లేదా పరోక్ష చమురు దిగుమతులను భారత్ నిలిపివేస్తుందని తాము ఆశిస్తున్నట్లు అమెరికా పేర్కొంది. ఒకవేళ రష్యా నుంచి ఎప్పటిలాగే చమురు కొంటున్నట్లు తేలితే భారత్‌పై మరోసారి 25 శాతం అదనపు సుంకాలు విధించడంతోపాటు మరికొన్ని ఆంక్షలు ఉంటాయని కార్యనిర్వాహక ఉత్తర్వులో తేల్చిచెప్పడం గమనార్హం. భారత్, రష్యాల మధ్య చమురు వాణిజ్యంపై నిఘా వేస్తామని అమెరికా సర్కార్ వెల్లడించింది. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమీసన్ గ్రీర్ హర్షం వ్యక్తంచేశారు. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య బంధం మరింత బలపడుతుందని చెప్పారు. అమెరికా ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుందని, దానివల్ల తమ పరిశ్రమలు, కార్మికులకు మేలు జరుగుతుందని చెప్పారు. భారత్‌తో ఈ ఒప్పందం విషయంలో ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

# కనులపండువగా లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం





- ముద్దాపురంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు
- హాజరైన ప్రముఖులు, భక్తులు

**వలిగొండ, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, సన్నాయి వాయిద్యాల నడుమ అర్చక బృందం ఈ కల్యాణాన్ని ఘనంగా జరిపింది. పండితుల ఆశీర్వచనాలతో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా సాగగా, ఆలయం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. ఈ కల్యాణోత్సవానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంత రెడ్డి, మత్స్యగిరిగుట్ట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డిని అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను ఆలయ కమిటీ చైర్మన్ వాకిటి కొండల్ రెడ్డి సమర్పించారు. విగ్రహాల దాత సామ బాల్ రెడ్డి కూడా కల్యాణోత్సవానికి హాజరయ్యారు. కల్యాణోత్సవం అనంతరం కొడితాల అలివేలుఅశోక్ గుప్తా దంపతులు, కొణితల శ్రీకాంత్‌నిమిషా దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర వితరణ చేశారు. అలాగే గ్రామ యువకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సామ సరస్వతిరాంరెడ్డి, విగ్రహ దాత సామ బాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సామ రాంరెడ్డి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ సామ నర్సిరెడ్డి, ధర్మకర్తలు వాకిటి గంగిరెడ్డి, వాకిటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి వెంకట్ రెడ్డి, గుంటోజు యాదాచారి, సామ నవీన్ రెడ్డి, పిన్నింటి ధర్మారెడ్డి, మాద సోమయ్య గౌడ్, ఆవుల అనిల్ యాదవ్, మీసాల కృష్ణ నాయకులు, పులిపల్పుల రాములు గౌడ్‌తో పాటు గ్రామ ప్రజలు, యువకులు, అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## లెక్కింపునకు సర్వం సిద్ధం!

- దివ్య బాల స్కూల్‌లో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని ఆదేశం



**భువనగిరి, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి మండలంలోని దివ్య బాల స్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి కేంద్రంలోని ఏర్పాట్లను సమీక్షించారు. కౌంటింగ్ హాల్స్‌లో టేబుల్స్ ఏర్పాటు, కౌంటింగ్ సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా తదితర మౌలిక వసతులను అధికారులు పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, చట్టబద్ధంగా ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామలింగం తదితర అధికారులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

- ఈ నెల 9 నుంచి ఆన్లైన్ లో దరఖాస్తులు సమర్పించాలి..
- అక్రిడేషన్ కమిటీ చైర్మన్ హనుమంతరావు.



**భువనగిరి, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 202628 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ హనుమంత రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలలో ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ నుంచి సమర్పించాలని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ప్రజా పాలన – ప్రగతి బాట సీఎం సభకు బయలుదేరిన కుల్కచర్ల మండల నాయకులు.

**కుల్కచర్ల ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని నారాయణపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమం భారీ బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పెద్ద మొత్తంలో బయలుదేరి వెళ్లడం జరిగింది. ప్రజా పాలన ప్రగతి బాట భారీ బహిరంగ సభకు బయలుదేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రామచంద్రయ్య, అనంతసాగర్ గ్రామ ఉప సర్పంచ్ మహేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు బయలుదేరి వెళ్లడం జరిగింది.



## యూరియా పంపిణీ ఇక 'యాప్' ద్వారానే!

- నేటి నుంచే అమలులోకి కొత్త విధానం

మొబైల్ నంబర్, ఓటీపీతో బుకింగ్

భౌతిక పంపిణీకి స్వస్తి: జిల్లా వ్యవసాయ అధికారి కే. అనురాధ

**భువనగిరి, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** యూరియా సరఫరాను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లాలో 'యూరియా బుకింగ్ మొబైల్ యాప్'ను నేటి నుంచే అమలులోకి తీసుకువచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కే. అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై జిల్లాలో యూరియా పంపిణీ పూర్తిగా ఈ యాప్ ద్వారానే జరుగుతుందని, భౌతికంగా యూరియా పంపిణీ ఉండదని స్పష్టం చేశారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ నంబర్‌ను ఉపయోగించి సులభంగా లాగిన్ అయి యూరియాను బుక్ చేసుకునే వీలుందని తెలిపారు. జిల్లాలోని రిటైలర్ల వారీగా అందుబాటులో ఉన్న యూరియా బ్యాగుల ప్రస్తుత స్టాక్‌ను రియల్ టైమ్‌లో పరిశీలించవచ్చని పేర్కొన్నారు. యూరియా బుకింగ్‌కు పట్టా భూయజమానులు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులు, నాన్ పట్టా రైతులు, కౌలుదారులు మాత్రమే అర్హులని వెల్లడించారు. రైతుల గుర్తింపును నిర్ధారించేందుకు పట్టా పాస్‌బుక్‌తో లింక్ చేసిన మొబైల్ నంబర్‌కు వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) పంపించి బుకింగ్‌ను సురక్షితంగా పూర్తి చేస్తారని తెలిపారు. రిటైలర్లు నివేదించే రియల్ టైమ్ స్టాక్ లభ్యత ఆధారంగానే యూరియా బుకింగ్ జరుగుతుందని, బుకింగ్ విజయవంతంగా పూర్తయిన అనంతరం రైతులకు ఒక ప్రత్యేకమైన బుకింగ్ ఐడి అందుతుందని చెప్పారు. రైతుల భూమిలో నమోదు చేసిన సాగు విస్తీర్ణాన్ని బట్టి బుక్ చేసుకునే యూరియా బ్యాగుల సంఖ్యను సిస్టం స్వయంచాలకంగా నిర్ణయిస్తుందని వివరించారు. పంపిణీని సమర్థంగా నిర్వహించేందుకు సాగు విస్తీర్ణం ఆధారంగా బుకింగ్‌లను నిర్దిష్ట విరామాలతో బహుళ విడతలుగా విభజిస్తామని తెలిపారు. రైతులు జిల్లాలోని ఏదైనా రిటైలర్ లేదా పీఏసీఎస్ ద్వారా బుక్ చేసుకున్న యూరియాను కొనుగోలు చేసుకునే సౌలభ్యం ఉందని, మొత్తం బుకింగ్ పరిమాణాన్ని వివిధ రిటైలర్ల వద్ద నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. సాగు ట్యాబ్‌లో భూమి విస్తీర్ణాన్ని ఒకసారి నమోదు చేసిన తర్వాత దానిలో మార్పులు చేయడానికి వీల్లేదని, అలాగే బుకింగ్ కేవలం 24 గంటల పాటు మాత్రమే యాక్టివ్‌గా ఉంటుందని తెలిపారు. నిర్ణీత గడువు లోపు యూరియాను కొనుగోలు చేయకపోతే, బుక్ చేసిన స్టాక్ ఆటోమేటిక్‌గా సిస్టంలోకి తిరిగి విడుదల అవుతుందని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానాన్ని రైతులు గమనించి యూరియా కొనుగోలుకు తప్పనిసరిగా యాప్‌ను వినియోగించాలని జిల్లా వ్యవసాయ అధికారి కే. అనురాధ సూచించారు.






## గులాబీ, ఎర్రజెండా అభ్యర్థులను దీవించండి!

- వార్డు సమస్యల పరిష్కారమే మిత్రపక్షాల లక్ష్యం
- మున్సిపల్ ఎన్నికల్లో కూసుకుంట్ల, వేస్లీ ప్రచార పర్వం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** చౌటుప్పల్ పురపాలక ఎన్నికల్లో భారాస, సీపీఎం మిత్రపక్షాలు బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలో 9వ వార్డు అభ్యర్థి దండ అరుణ్ కుమార్, 10వ వార్డు అభ్యర్థి గోశిక సుమతి, 16వ వార్డు అభ్యర్థి బత్తుల జయమ్మ, 19వ వార్డు అభ్యర్థి బత్తుల శ్రీశైలం గౌడ్ గెలుపు కోసం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురపాలక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా చివరి నిమిషం వరకు సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. వార్డు సమస్యలు పరిష్కారం కావాలంటే మిత్రపక్షాలు బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. పట్టణంలో డ్రైనేజీ, రోడ్లు, మంచినీటి సమస్యల కారణంగా ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి, వార్డుల సమగ్ర అభివృద్ధి మిత్రపక్షాల అభ్యర్థులతోనే సాధ్యమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపిస్తూ, ప్రజలు ఆలోచించి అభివృద్ధికి ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు గిర్కటి నిరంజన్, బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే సీపీఎం నాయకులు బూరుగు కృష్ణ రెడ్డి, ఎండి పాష, గోశిక కరుణాకర్, గంగాదేవి సైదులు, జెల్లల పెంటయ్య, వనం ఉపేందర్, గుణమోని ఐలయ్య, బొడ్డు అంజిరెడ్డి, చింతల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటే ఆయుధం



- చౌటుప్పల్‌లో భారీ అవగాహన ర్యాలీ
- మానవహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ

**చౌటుప్పల్, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామ్ రెడ్డి అన్నారు. ఓటర్లలో చైతన్యం నింపేందుకు చేపట్టిన 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తంగడిపల్లి రోడ్డు చౌరస్తా మీదుగా సాగి నాగులకుంట జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది కలిసి భారీ మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అందరితో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేస్తామని పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా సాగి తిరిగి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఎన్నికల అధికారి అంజయ్య, పారిశుధ్య తనిఖీ అధికారి హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, వార్డు అధికారులు, బిల్లుల వసూలు సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, విద్యుత్ సిబ్బంది, నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు. మహిళా సంఘాల వనరుల వ్యక్తులు, మహిళా సంఘ సభ్యులు, ట్రినిటీ పాఠశాల విద్యార్థులు నినాదాలతో పట్టణ వీధుల్లో సందడి చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు.





# గణితంలో మెలకువలతో ఉన్నత స్థానాలను అధిరోహించాలి

- విద్యార్థులకు గణిత మెళుకువలు నేర్పించిన బండారి స్వప్న రాము

**వలిగొండ, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** గణితంలో మెళుకువలు అలవర్చుకుంటే విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించగలరని గ్రామ నివాసి బండారి స్వప్న రాము అన్నారు. తాము నేర్చుకున్న గణిత నైపుణ్యాలను తమ గ్రామంలోని విద్యార్థులకు కూడా అందించాలనే లక్ష్యంతో వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం శనివారం ఉచిత అబాకస్, వేదిక్ మ్యాథ్స్ డెమో తరగతులను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల మాదిరిగా సృజనాత్మకంగా ఆలోచించే విధంగా గణితంలో మెళుకువలు నేర్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గణితంపై భయం తొలగించి, వేగంగా లెక్కలు చేయగల సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ తరగతుల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. త్వరలోనే ఆన్‌లైన్ విధానంలో కూడా గణిత బోధనలు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ డెమో తరగతులకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందానికి బండారి స్వప్న రాము ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదరించి ఆశీర్వదిస్తే.. అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా!

- వార్డు అభివృద్ధికి ఓటు వేయాలని అభ్యర్థన
- భారీ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, మహిళలు
- 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పాక చిరంజీవి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాక చిరంజీవి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. వార్డు అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో వార్డు మొత్తం పార్టీ సీనియర్ నాయకులు, మహిళలతో కలిసి భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాక చిరంజీవి మాట్లాడుతూ, వార్డు అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే వార్డును అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీతా రామచంద్రస్వామి దేవాలయ గుడి కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, కంచర కుంట్ల వెంకట్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ బుంగపట్ల భారతమ్మ, మాజీ కౌన్సిలర్ సుల్తాన్ రాజు పాల్గొన్నారు. అలాగే వార్డు ఇన్‌చార్జీలు మాధవన్ శేఖర్ గౌడ్, బక్క శ్రీనాథ్, తీగుళ్ల బాలరాజు, పార్టీ సీనియర్ నాయకులు తమ్మ కొండ రాజు, మాస సుధాకర్, మానుపాటి వెంకటేశ్వర్, బొమ్మ కంట శివ, సుల్తాన్ శేఖర్, జాజుల శివ, అల్లి కృష్ణ, సాయి, కంచరకుంట్ల శశిధర్ రెడ్డి, తేలుకుంట్ల నవీన్, మహిళా నాయకురాలు బొబ్బిళ్ల సంధ్యతో పాటు రెడ్డి లక్ష్మి, చిందం జ్యోతి, జిట్టం, కవిత, కౌసల్య, బుడ్డా దివ్య తదితర మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 8, 9 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అవకాశం

- ఎన్నికల విధుల సిబ్బందికి ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రం
- మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామ్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 11న జరగనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును కోల్పోకుండా వినియోగించుకునేలా ఈ నెల 8, 9 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వేయవచ్చని తెలిపారు. పోస్టల్ ఓటు వినియోగించుకునేందుకు వచ్చే ఎన్నికల సిబ్బంది తప్పనిసరిగా డ్యూటీ ఆర్డర్ కాపీ, ఎన్నికల గుర్తింపు కార్డు, ఫారం12 వెంట తీసుకురావాలని కమిషనర్ స్పష్టం చేశారు. అవసరమైన పత్రాలు లేకపోతే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడం సాధ్యం కాదని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని పేర్కొన్న కమిషనర్, ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యే సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆయన వెల్లడించారు.

# ప్రలోభాలకు లొంగవద్దు.. ఓటును అమ్ముకోవద్దు

- ఓటు వేయడం బాధ్యత.. సరైన వ్యక్తిని ఎంచుకోవడం అవసరం
- అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకోవాలి
- జిల్లా కలెక్టర్ హనుమంత రావు




**భువనగిరి, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే వార్డుల కోసం నిజాయితీగా పనిచేసే నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల పరిధిలో స్వీప్ కార్యక్రమాలు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో డీఆర్‌డీవో నాగిరెడ్డి, భువనగిరి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ రామలింగం, ఆలేరు మున్సిపాలిటీలో ఆర్డీవో కృష్ణారెడ్డి, మోత్కూర్ మున్సిపాలిటీలో అదనపు డీఆర్‌డీవో సురేష్, పోచంపల్లి మున్సిపాలిటీలో తహసిల్దార్ శ్రీనివాస్, కమిషనర్ అంజన్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఆర్డీవో శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా ఓటర్లతో తమ ఓటును డబ్బు, మద్యం లేదా ఇతర ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీ గల మంచి వార్డు సభ్యుడిని ఎన్నుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటరుగా నమోదు అయిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని ఆయన సూచించారు. ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు, కార్యక్రమాల ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులైనా, భవిష్యత్తులో వారంతా ఓటర్లుగా మారతారని పేర్కొన్నారు. డబ్బు, మద్యం, బహుమతులు, బిర్యానీ వంటి ప్రలోభాలకు లోనై ఓటు వేస్తే, ఎన్నికల అనంతరం గెలిచిన అభ్యర్థిని వార్డు అభివృద్ధిపై ప్రశ్నించే హక్కును కోల్పోతామని హెచ్చరించారు. మన ఇంట్లో, పని చేసే చోట మంచి నాయకులను ఎంపిక చేయడంపై చర్చించుకోవడం ద్వారా వార్డుల అభివృద్ధి సాధ్యమవు తుందని తెలిపారు. అభ్యర్థులు ఇచ్చే ప్రలోభాలకు లోబడకుండా అందరూ మెచ్చే మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరు ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటారో, ఎవరు అభివృద్ధికి కృషి చేస్తారో వారికే ఓటు వేయాలని సూచించారు. మంచి నాయకుడిని ఎన్నుకోవడం వల్ల వార్డుల అభివృద్ధి ముందుకు సాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి వార్డులో "మా ఓటును అమ్ముకోము స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగిస్తాం" అనే సందేశంతో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.









# అభివృద్ధే లక్ష్యం.. గెలిపిస్తే వార్డు రూపురేఖలు మారుస్తాం

- 2వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి సుర్వి మంజుల ముమ్మర ప్రచారం
- పబ్బు అరుణ రాజు గౌడ్ ఆధ్వర్యంలో గడప గడపకూ పార్టీ సిద్ధాంతాలు





**చౌటుప్పల్, ఫిబ్రవరి 7 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సుర్వి మంజుల నర్సింహ్మా గౌడ్ గెలుపును కాంక్షిస్తూ శనివారం విస్తృత స్థాయిలో గడప గడప ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారాన్ని పబ్బు అరుణ రాజు గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టారు. వార్డులోని ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలను కలుసుకున్న ప్రచార బృందం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించింది. స్థానిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ తాగునీటి కొరత, పారిశుధ్య లోపాలు, రహదారుల దుస్థితి, వీధి దీపాల సమస్యలు వంటి అంశాలను గుర్తించారు. గెలుపు అనంతరం ఈ సమస్యలన్నింటినీ ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పబ్బు అరుణ రాజు గౌడ్ మాట్లాడుతూ.. రెండవ వార్డును అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేసే అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. అభ్యర్థి సుర్వి మంజుల నర్సింహ్మా గౌడ్ మాట్లాడుతూ.. తన గెలుపుతో రెండవ వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని, వార్డు రూపురేఖలు పూర్తిగా మార్చేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల నమ్మకానికి తగిన విధంగా పనిచేస్తానని ఆమె భరోసా ఇచ్చారు. ప్రచారంలో మహిళలు, యువత, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. ప్రజల నుంచి లభించిన స్పందనను బట్టి రెండవ వార్డులో కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం నెలకొందని ప్రచారకులు పేర్కొన్నారు. ఈ గడప గడప ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# హెట్‌మెయిర్ ధనాధన్.. చెలరేగిన షెఫర్డ్.. విండీస్ బోణీ



ఈడెన్ గార్డెన్స్‌లో టాస్ గెలిచిన స్కాట్లాండ్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. వెస్టిండీస్ బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లలో బ్రాండన్ కింగ్ (35) రాణించగా.. కెప్టెన్ షాయి హోప్ (19) ఫర్వాలేదనిపించాడు. ఇక వన్‌డౌన్‌లో వచ్చిన షిమ్రన్ హెట్‌మెయిర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మొత్తంగా 36 బంతుల్లో రెండు ఫోర్లు, ఆరు సిక్సర్ల సాయంతో హెట్‌మెయిర్ 64 పరుగులు సాధించాడు. రోవ్‌మన్ పావెల్ (14 బంతుల్లో 24), షెర్ఫానే రూథర్‌ఫర్డ్ (13 బంతుల్లో 26) ధనాధన్ దంచికొట్టారు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి విండీస్ 182 పరుగుల మెరుగైన స్కోరు సాధించింది. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ క్యూరీ రెండు వికెట్లు తీయగా.. సఫ్యాన్ షరీఫ్, ఒలీవర్ డేవిడ్‌సన్, మైకేల్ లీస్క్ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఇక లక్ష్య ఛేదనలో స్కాట్లాండ్ ఆది నుంచే తడబడింది. టాపార్డర్‌లో జార్జ్ మూన్సే (19), బ్రాండన్ మెక్‌ముల్లన్ (14) నిరాశపరచగా.. మైకేల్ జోన్స్ (1) విఫలమయ్యాడు. ఇలాంటి తరుణంలో రిచీ బెరింగ్‌టన్ కెప్టెన్ ఇన్నింగ్స్ (24 బంతుల్లో 42)తో అలరించగా.. టామ్ బ్రూస్ (28 బంతుల్లో 35) అతడికి తోడుగా నిలిచాడు. అయితే, మిగతా వారి నుంచి వీరికి సహకారం అందలేదు. మాథ్యూ క్రాస్ (11), మార్క్ వాట్ (15) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేయగా.. 18.5 ఓవర్లలోనే స్కాట్లాండ్ ఆలౌట్ అయింది. 147 పరుగులకే పరిమితమై 35 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. విండీస్ బౌలర్లలో జేసన్ హోల్డర్ మూడు వికెట్లు తీయగా.. షెఫర్డ్ హ్యాట్రిక్‌తో కలిపి ఐదు వికెట్లు పడగొట్టి స్కాట్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ పతనాన్ని శాసించాడు. షమర్ జోసెఫ్, గుడకేశ్ మోటీ తలా ఒక వికెట్ తీసి తమ వంతు సాయం అందించారు.







# 'సమ్'తృప్తికర ఆరంభం

**అభిషేక్ శర్మ డకౌట్... పవర్‌ప్లే ముగిసేసరికి 46/4... ఒకదశలో వరుసగా 26 బంతుల పాటు బౌండరీనే రాలేదు... 12.4 ఓవర్లు ముగిసేసరికి 77/6... పరిస్థితి చూస్తే అమెరికా సంచలన విజయానికి పునాది వేసుకున్నట్లు అనిపించింది. కానీ సూర్యకుమార్ అసలు సమయంలో తన స్థాయిని ప్రదర్శించాడు. ఒంటి చేత్తో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు. మిగిలిన 44 బంతుల్లో భారత్ మరో 84 పరుగులు జోడిస్తే వీటిలో సూర్య ఒక్కడే 7 ఫోర్లు, 4 సిక్సలు సహా 63 పరుగులు సాధించాడు.**

ఛేదనలో ఆరంభం నుంచే తడబడిన అమెరికా ఆతిథ్య జట్టు సవాల్ ముందు నిలవలేకపోయింది. భారత బౌలర్లు సిరాజ్, అర్ష్ దీప్, అక్షర్ పటేల్ సమష్టిగా రాణించడంతో లక్ష్యానికి చాలా దూరంలో నిలిచిపోయింది. బలహీన జట్టుతో మ్యాచ్‌లో చివరకు గట్టెక్కినా... ఈ మ్యాచ్ భారత బ్యాటింగ్‌కు చిన్న హెచ్చరికను జారీ చేసింది. ముంబై: టి20 వరల్డ్ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ శుభారంభం చేసింది. చిన్న జట్టు చేతిలో కాస్త పోటీ ఎదురైనా చివరకు పైచేయి సాధించింది. శనివారం జరిగిన గ్రూప్ 'ఎ' పోరులో భారత్ 29 పరుగుల తేడాతో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ)పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. సహచరులంతా విఫలమైనా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (49 బంతుల్లో 84; 10 ఫోర్లు, 4 సిక్సలు) దూకుడుగా ఆడి జట్టుకు మెరుగైన స్కోరును అందించారు. అమెరికా బౌలర్లలో వాన్ షాక్‌విక్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులకే పరిమితమైంది. శుభమ్ రంజనే (22 బంతుల్లో 37; 2 ఫోర్లు, 3 సిక్సలు), సంజయ్ కృష్ణమూర్తి (31 బంతుల్లో 37; 1 ఫోర్, 2 సిక్సలు), మిలింద్ కుమార్ (34 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు.

సిరాజ్ 3 వికెట్లు పడగొట్టగా... అర్ష్ దీప్, అక్షర్ చెరో 2 వికెట్లు తీశారు. అనారోగ్యం కారణంగా భారత టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్ బరిలోకి దిగలేదు. భారత్ తమ తర్వాతి పోరులో గురువారం న్యూఢిల్లీలో నమీబియాతో తలపడుతుంది.

### సూర్యకుమార్‌కు లైఫ్...

హిట్టర్ అభిషేక్ శర్మ (0) తాను ఆడిన తొలి బంతికే అనూహ్యంగా 'డకౌట్' కాగా... ఇషాన్ కిషన్ (16 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్సలు), తిలక్ వర్మ (16 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) కలిసి కొన్ని చక్కటి షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించారు. నేత్రావల్కర్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో తిలక్ ధాటిని ప్రదర్శించగా, అలీఖాన్ ఓవర్లో ఇషాన్ వరుసగా 4, 6 కొట్టాడు. అయితే షాల్‌విక్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో ఒక్కసారిగా ఆట మలుపు తిరిగింది. రెండో బంతికి ఇషాన్ కిషన్ వెనుదిరగ్గా, ఓవర్లోని చివరి రెండు బంతుల్లో వరుసగా తిలక్, శివమ్ దూబే (0) అవుటయ్యారు.

పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 49/4 వద్ద నిలిచింది. లెగ్‌స్పిన్నర్ మొహసిన్ బౌలింగ్‌లో వరుసగా ఏడు బంతుల పాటు సింగిల్ కూడా తీయలేకపోయిన రింకూ సింగ్ (6) అసహనంతో తర్వాతి బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించి అవుట్ కాగా, హార్దిక్ పాండ్యా (5) కూడా ప్రభావం చూపలేకపోయాడు. ఇలాంటి స్థితిలో సూర్యకుమార్ బాధ్యత తీసుకున్నాడు. 15 పరుగుల వద్ద శుభమ్ తన బౌలింగ్‌లోనే సూర్య ఇచ్చిన క్యాచ్‌ను అందుకోవడంలో విఫలం కావడంతో భారత కెప్టెన్ కు లైఫ్ లభించింది. దీనిని అతను సమర్థంగా వాడుకుంటూ చకచకా పరుగులు రాబట్టాడు. నేత్రావల్కర్ ఓవర్లో సూర్య, అక్షర్ పటేల్ (11 బంతుల్లో 14; 2 ఫోర్లు) కలిసి 3 ఫోర్లు, సిక్స్‌తో మొత్తం 21 పరుగులు రాబట్టారు. 36 బంతుల్లో సూర్య అర్ధసెంచరీ పూర్తయింది. నేత్రావల్కర్ వేసిన ఆఖరి ఓవర్లో సూర్య వరుస బంతుల్లో 4, 6, 6, 4 బాది ఇన్నింగ్స్‌ను ఘనంగా ముగించాడు. ఛేదనలో అమెరికాకు సరైన ఆరంభం లభించలేదు. తొలి 20 బంతుల్లో 5 పరుగుల వ్యవధిలో జట్టు 3 వికెట్లు కోల్పోయింది. సిరాజ్ వరుస ఓవర్లలో గూస్ (6), సాయితేజ ముక్కామల (2)లను వెనక్కి పంపగా, మోనాంక్ పటేల్ (0) వికెట్ అర్ష్ దీప్ ఖాతాలో చేరింది. ఈ దశలో మిలింద్, కృష్ణమూర్తి కలిసి కొన్ని చక్కటి షాట్లతో ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 52 బంతుల్లో 58 పరుగులు జోడించారు. అయితే మిలింద్‌ను అవుట్ చేసి వరుణ్ ఈ జోడీని విడగొట్టగా... 29 బంతుల్లో 60 పరుగులు చేయాల్సిన స్థితిలో అక్షర్ వరుస బంతుల్లో కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్ (0)లను అవుట్ చేశాడు. దాంతో అమెరికా గెలుపు ఆశలు కోల్పోయింది. చివర్లో శుభమ్ కొంత పోరాడినా లాభం లేకపోయింది. 2024 జూలైలో భారత్ తరఫున చివరి టి20 ఆడి జట్టుకు దూరమైన సిరాజ్... అనూహ్యంగా వరల్డ్ కప్ అవకాశం దక్కించుకొని తొలి మ్యాచ్‌లోనే 3 వికెట్లతో సత్తా చాటాడు. అమెరికా జట్టులో సభ్యులైన సౌరభ్ నేత్రావల్కర్, శుభమ్ రంజనే, హర్మీత్ సింగ్‌లకు ముంబైతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ ముగ్గురూ ముంబైలోనే ఓనమాలు నేర్చుకొని ఇక్కడే కెరీర్‌ను మలచుకున్నారు. ముగ్గురు కూడా జూనియర్, అండర్19 క్రికెట్‌ను ముంబై తరఫునే ఆడటంతో పాటు రంజీ ట్రోఫీలో కూడా అదే జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. రంజనే చివరి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడినప్పుడు జట్టు కెప్టెన్ గా సూర్యకుమార్ యాదవ్ ఉన్నాడు.

## పాక్ కష్టంగా.. నెదర్లాండ్స్‌పై ఉత్కంఠ విజయం

ఆదుకున్న ఫహీమ్ అష్రఫ్

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌కు తమ తొలి మ్యాచ్‌లోనే చావుతప్పి కన్ను లొట్టపోయే పరిస్థితి ఏర్పడింది. శనివారం జరిగిన పోరులో పాక్ 3 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై చెమటోడ్చి నెగ్గింది. నిర్దేశిత 148 పరుగుల లక్ష్యాన్ని పాక్ మరో మూడు బంతులు మిగిలుండగా 7వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. ఓపెనర్ షాహిబ్జాదా ఫర్హాన్(47) రాణించగా, ఆఖర్లో ఫహీమ్ అష్రఫ్(11 బంతుల్లో 29 నాటౌట్, 2ఫోర్లు, 3సిక్సలు) ఆపద్బాంవునిలా ఆదుకున్నాడు. అయితే డచ్ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టడంతో ఒక దశలో 90/2తో మెరుగ్గా కనిపించిన పాక్ 16.1 ఓవర్లలో 114కు 7 వికెట్లు కోల్పోయింది. చివరి రెండు ఓవర్లలో జట్టు విజయానికి 29 పరుగులు అవసరమైన దశలో క్రీజులోకి వచ్చిన అష్రఫ్ మూడు సిక్సలు, ఒక ఫోర్‌తో 24 పరుగులు పిండుకున్నాడు. దీంతో గెలుపు సమీకరణం కాస్తా ఆరు బంతుల్లో 5 పరుగులకు చేరగా, లీడ్ బౌలింగ్‌లో ఫోర్‌తో అష్రఫ్ మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు కెప్టెన్ ఎడ్వర్డ్స్(37), లీడె(30) రాణించడంతో నెదర్లాండ్స్ 147 పరుగులు చేసింది.



## అఫ్గనిస్థాన్ మహిళా క్రికెటర్లకు మద్ధతిస్తున్నా





పురుషుల టీ20 ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌కు ముందు అఫ్గనిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ప్రభుత్వ ఆంక్షలతో విదేశాల్లో తలదాచుకుంటున్న తమ దేశ మహిళా క్రికెటర్లకు అతడు మద్దతు తెలిపాడు. న్యూజిలాండ్‌తో మ్యాచ్ సన్నద్ధతపై మాట్లాడిన రషీద్‌ను మీరు అఫ్గనిస్థాన్ మహిళా క్రికెటర్లకు మద్దతిస్తారా?అని విలేకరులు ప్రశ్నించారు. అందుకు రషీద్ ఖాన్ కచ్చితంగా మద్దతిస్తాను అని బదులిచ్చాడు. ఐదేళ్ల క్రితం అఫ్గనిస్థాన్‌లో తాలిబాన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల హక్కులు హరించిపోయాయి. విద్యావంతులు, మేధావులు, మహిళా క్రికెటర్లు విదేశాల్లో తలదాచుకుంటున్నారు. ప్రభుత్వం ఆంక్షల నేపథ్యంలో పలువురు అమ్మాయిలు, మహిళలు క్రికెట్ ఆశను చంపుకొని బతికేస్తున్నారు. తమ అభిరుచిని గౌరవించి.. ఆడేందుకు అనుమతివ్వాలని వారు కోరుతున్నారు. ఇటీవలే పురుష క్రికెటర్లు బహిరంగంగా మద్దతు తెలపాలని మహిళా ప్లేయర్ ఫిరూజా అమిరి అభ్యర్థించింది. దాంతో.. ప్రపంచకప్ వేదికను మించిన బిగ్ స్టేజ్ ఉంటుందా? అనుకున్నాడేమో నాకేం అభ్యంతరం లేదని రషీద్ ఖాన్ పేర్కొన్నాడు. 'అఫ్గనిస్థాన్ మహిళల జట్టు కచ్చితంగా ఆడాలి. ఐసీసీ పూర్తి సభ్యత్వం కలిగిన జట్టుగా గుర్తించాలి. ఈ విషయం ఐసీసీకి, అఫ్గన్ క్రికెట్ బోర్డుకు తెలుసు. ఏ వేదికపై అయినా.. ఎవరైనా అఫ్గనిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారంటే చాలా సంతోషం. నిజంగా అది మాకు గర్వపడాల్సిన సందర్భం. అయితే ఈ అంశంపై అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు, ఐసీసీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆటగాళ్లుగా మేము ఇందులో ఏం చేయలేం. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో మేము చేయగలిగేది చాలా తక్కువే. అధికారంలో ఉన్నవారు ఈ విషయాన్ని మందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నా' అని ప్రీ-మ్యాచ్ మీడియా సమావేశంలో కాబూలీ సారథి వెల్లడించాడు.

### ఐసీసీ కీలక నిర్ణయం

శరణార్థులుగా విదేశాల్లో నివసిస్తున్న అఫ్గనిస్థాన్ మహిళా క్రికెటర్లకు అండగా నిరుడు ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లను వీక్షించే అవకాశం కల్పించింది. అంతేకాదు బీసీసీఐ, ఇంగ్లండ్ బోర్డు, ఆస్ట్రేలియా బోర్డు సహకారంతో అఫ్గన్ మహిళా క్రికెటర్లకు శిక్షణ శిబిరాలు, దేశవాళీ మ్యాచ్‌లు ఆడించాలని తీర్మానించింది.

## ఫైనల్లో 12 మంది బాక్సర్లు బాక్సమ్ ఎలైట్ టోర్నీ

లా నూసియా(స్పెయిన్): బాక్సమ్ ఎలైట్ అంతర్జాతీయ టోర్నీలో భారత బాక్సర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ ఒలింపిక్ పతక విజేత లవ్లీనా బొర్గోహై, వరల్డ్‌కప్ పసిడి విజేత సచిన్ సివాచ్ సహా 12 మంది బాక్సర్లు ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఇందులో ఎనిమిది మంది మహిళా బాక్సర్లు, నలుగురు పురుష బాక్సర్లు ఉన్నారు. శనివారం జరిగిన మహిళల 75కిలోల సెమీస్ బౌట్‌లో లవ్లీన 5-0తో రోసి ఎక్లెస్(వేల్స్)పై ఘన విజయం సాధించింది. 54కిలోల సెమీస్‌లో ప్రీతి పవార్ 5-0తో ఆయా హమ్దీ(ఫ్రాన్స్)పై గెలిచి పూనమ్‌తో ఫైనల్ పోరుకు సిద్ధమైంది. మరో సెమీస్‌లో పూనమ్ 4-1తో ఇవీ జేన్ స్మిత్(ఇంగ్లండ్)పై గెలువగా, మంజురాణి(48కి), నీతు గంగాస్(51కి), ప్రియ(60కి), అరుంధతి చౌదరి(70కి), నైనా(80కి) తుదిపోరులో నిలిచారు.





నేహా శెట్టి

# లెనిన్' కోసం భాగ్యశ్రీ



యంగ్ హీరో అక్కినేని అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'లెనిన్' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి డైరెక్ట్ చేస్తుండగా పూర్తి రూరల్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే, ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ శ్రీలీల ఎంపికవగా, కొన్ని కారణాల వల్ల ఆమె ఈ సినిమా నుంచి తప్పుకుంది. ఇక ఇప్పుడు ఆమె స్థానంలో మరో బ్యూటీ భాగశ్రీ బోర్సే ఈ సినిమాలో హీరోయిన్‌గా జాయిన్ అయింది. ఈ సినిమా షూటింగ్ కోసం భాగ్యశ్రీ తీవ్రంగా శ్రమిస్తుందట. ఈ సినిమా కంటే ముందే భాగ్యశ్రీ పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. రామ్ సరసన 'ఆంధ్రా కింగ్ తాలూకా', దుల్కర్ సల్మాన్‌తో 'కాంత' వంటి క్రేజీ ప్రాజెక్టుల్లో ఆమె నటిస్తుంది. దీంతో ఈ మూడు చిత్రాల షూటింగ్‌ల కోసం భాగ్యశ్రీ ఒక సెట్ నుంచి మరో సెట్‌కు చక్కర్లు కొడుతుందని సినీ సర్కిల్స్ టాక్. ఇక లెనిన్ సినిమాలో ఆమె పాత్ర ప్రేక్షకులను ఎలా ఆకట్టుకుంటుందా అనేది ఆసక్తికరంగా మారింది.





# జాన్వీ కపూర్ మండిపాటు..

హిందీ సహా తెలుగు సినిమా దగ్గర కూడా మంచి ఫేమ్ ఉన్న బాలీవుడ్ యంగ్ హీరోయిన్స్ లో దేవర, ఇప్పుడు పెద్ది బ్యూటీ జాన్వీ కపూర్ ఒకరు. మరి జాన్వీ కపూర్ తాజాగా ఓ విషాద ఘటన విషయంలో మండిపాటు వ్యక్తం చేసింది. అయితే బాలీవుడ్ కి చెందిన ప్రముఖ నటి షెఫాలీ జరీవాలా అకాల మరణం తర్వాత ఆమెకి జరిగే అంతిమ కార్యక్రమాలు విషయంలో కొందరు మీడియా వ్యక్తులు కనబరిచిన అత్యుత్సాహానికి ప్రముఖ హీరో వరుణ్ ధావన్ తన ఇన్స్టా ద్వారా ఆగ్రహం వ్యక్తం చేసి కనీసం ఇలాంటి విషయాల్లో అయినా మీడియా వ్యక్తులు కవర్ చేసిన విధానం సరికాదని వరుణ్ చీవాట్లు పెట్టాడు. అయితే తన స్టేట్మెంట్ కి జాన్వీ కపూర్ తన సమ్మతి తెలిపింది. చివరికి కనీసం ఒకరైన నోరు విప్పారు అంటూ ఈ సున్నిత అంశం పట్ల వరుణ్ స్టేట్మెంట్ తో నిలబడింది. దీనితో జాన్వీ కపూర్ స్టోరీ కూడా వైరల్ గా మారింది.




# అల్లరి నరేష్ నెక్ట్స్.. టైటిల్ ఫస్ట్ లుక్ ఎప్పుడంటే!

మన టాలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ హీరోస్ లో నటన పరంగా ప్రాణం పెట్టే అతి కొద్ది మంది హీరోస్ లో అల్లరి నరేష్ కూడా ఒకరు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగల హీరో నరేష్. అయితే ప్రస్తుతం సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్న అల్లరి నరేష్ నుంచి తన కెరీర్ 63వ సినిమాపై లేటెస్ట్ అప్డేట్ ఇపుడు బయటకి వచ్చింది. దీనితో అల్లరి నరేష్ నెక్ట్స తాలూకా ఫస్ట్ లుక్ సహా టైటిల్ ని రిలీజ్ చేయడానికి మేకర్స్ డేట్ ఫిక్స్ చేశారు. రేపు జూన్ 30న వచ్చేస్తున్నట్టుగా అనౌన్స్ చేశారు. మరి ఈ టైటిల్, ఫస్ట్ లుక్ ఎలా ఉంటాయో చూడాలి. ఇక ఈ చిత్రాన్ని మెహర్ తేజ్ దర్శకత్వం వహిస్తుండగా సక్సెస్ ఫుల్ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ అలాగే శ్రీకార స్టూడియోస్ వారు సంయుక్తంగా నిర్మాణం వహిస్తుండడం విశేషం.